సాక్షి నల్లగొండ

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



వరిపైరు ఎండుతోంది
ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి సాగునీటి విడుదల చేయకపోవడంతో మునగాల మండలంలో వరిచేలు ఎండిపోతున్నాయి. - 8లో



నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం
కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం నేత జూల కంటి రంగారెడ్డి ఆరోపించారు. - 8లో



ఇక్కత్ వస్త్రాల ప్రదర్శన
ఢిల్లీలో ప్రారంభమైన గ్లోబల్ టెక్స్‌టైల్ ఈవెంట్ భాటో, ఎక్స్‌పోలో చేనేత ఇక్కత్ వస్త్రాలు, మగ్గాన్ని ప్రదర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం నల్లగొండకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని ఒక హోటల్‌లో ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

డైరెక్టర్‌గా అరుణ ప్రియ

నల్లగొండ టూటౌన్ : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకురాలు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అరుణ ప్రియను ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రెనింగ్ సెంటర్ డైరెక్టర్‌గా నియమిస్తూ రిజిస్ట్రార్ అలువాల రవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె విద్యార్థుల్లో ఆంగ్లభాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక తరగతుల నిర్వహించనున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 126 మంది గైర్హాజరు

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు శుక్రవారం 126 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెంకడియర్ జువాలజీ, ఫిజిక్స్, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూహెచ్(పిమేల్), ఈటీ సబ్జెక్టులకు ప్రాక్టికల్ పరీక్షకు మొత్తం 1864 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 1794 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1200 మంది హాజరుకావాల్సి ఉండగా 1,148 మంది పరీక్ష రాశారు. 52 మంది గైర్హాజరయ్యారు.

పాఠ్య ప్రణాళిక మండలి అధ్యక్షుడిగా బెల్లి యాదయ్య



నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తెలుగు, ప్రాచ్య భాషల పాఠ్య ప్రణాళికా మండలి అధ్యక్షుడిగా అసోసియేట్ ప్రొఫెసర్, నకిరేకల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బెల్లి యాదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కేశవులు

రామగిరి(నల్లగొండ) : సమాజానికి దిక్సూచిగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం కావాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. శుక్రవారం నల్లగొండలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుకున్నవారు, మేధావులు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని సాధారణ ఓటర్లకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. అనంతరం ఇటీవల గవర్నర్ పురస్కారం అందుకున్న జల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో ఎంజీయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ అంజిరెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తౌకల సుధారాణి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, భిక్షపతిగౌడ్, నిరంజన్, రేఖ్యానాయక్, శ్రీనివాస్, మధు, శ్రీకాంత్, మహేష్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేసే వరకూ పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నల్లగొండ టౌన్ : స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకు సమరశీల పోరాటాలు చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. శుక్రవారం నల్లగొండలోని స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కుంచం, కావ్య, స్పందన సిరి, కిరణ్ సైఫ్, రెహ్మాన్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నీలగిరి కాలనీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి ధ్వజస్తంభ గోపుర శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ప్రతిష్ఠామూర్తుల శోభాయాత్ర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, భగవత్ ప్రార్థన, విశ్వక్సేన పూజలు చేశారు. భక్తులు కోలాటాలు, భజనలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆశావహులకు నిరాశ

- 'స్థానిక' పోరుకు ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే
- కులగణన, రిజర్వేషన్ల కోసం తప్పని వాయిదా
- ఇప్పటికే ఎన్నికలకు సిద్ధమైన గ్రామ స్థాయి నేతలు
- నోటిఫికేషన్ వస్తుందనుకున్న తరుణంలో వాయిదా పడడంతో నిరాశ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మొన్నటి వరకు ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల్లో నేతలు పదవులపై ఆశతో ఉన్నారు. అధికారులు సైతం ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర పనులు పూర్తి చేసుకున్నారు. అయితే మరోసారి కులగణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడంపై.. ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరికొంత కాలం పడనున్నాయి. దీంతో ఆశావహులు ఎన్నికల కోసం ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది.

పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడాదిపైనే..

గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగిసి ఏడాది దాటిపోయింది. గత ఆగస్టులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో జిల్లాలోని 868 గ్రామ పంచాయతీల్లో ఆశావాహులు అన్ని సిద్ధం చేసుకునే పనుల్లో ఉన్నారు. ఇదే క్రమంలో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో 352 ఎంపీటీసీలు, 33 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆయా పార్టీల నాయకులు కూడా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ రిజర్వేషన్ అయితే ఎవరు పోటీ చేయాలనే విషయంలో గ్రామాల్లో నేతలు చర్చించుకుని సిద్ధమయ్యారు. ఈనెల 15వ తేదీ నాటికి షెడ్యూల్ కూడా వెలువడుతుందని అంతా భావించారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పట్లో ఎన్నికలు జరగవని తేలిపోయింది.

మే, జూన్‌లోనే స్థానిక పోరు?

ఈ నెల చివరిలోగా బీసీ కులగణన రీసర్వే పూర్తి చేసి దాన్ని అసెంబ్లీలో ఆమోదించిచనున్నారు. ఆ తర్వాత పార్లమెంట్‌లో ఆమోదానికి పంపి దేశంలోని వివిధ రాజకీయ పార్టీ నేతలతో మాట్లాడి ఒప్పించే విధంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకుంటానని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసి మే, జూన్ నెలల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండవచ్చని నేతలు పేర్కొంటున్నారు. అప్పటి వరకు పరిస్థితులు మారకుండా చూసుకోవడం తలకుమించిన భారంగా మారుతుందని ఆశావహులు వాపోతున్నారు.

మళ్లీ కులగణన

ఇప్పటికే నిర్వహించిన కులగణనలో 3 లక్షల పైచిలుకు మంది పాల్గొనలేదు. అయితే వారందరి కోసం మళ్లీ కులగణన నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కులగణన నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ సర్వేతోపాటు టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన అధికారుల వద్ద కూడా నమోదు చేసుకునే విధంగా అవకాశం కల్పించారు.

ఎంజీయూలో సమూల మార్పులు



'మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాం. గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం.. రెండు నెలల పాటు యూనివర్సిటీలో జరుగుతున్న అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలను పరిశీలించా. విద్యార్థులు.. అధ్యాపకుల పనివేళలు, వసతి గృహంలో విద్యార్థులకు భోజన వసతి.. యూనివర్సిటీ పనివేళలు.. మెస్ బిల్లులు, విద్యార్థుల హాజరు శాతంపై కొత్త నిర్ణయాలను అమలు చేస్తున్నాం'. ఎంజీయూ వీసీ మహ్మద్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. - నల్లగొండ టూటౌన్

- పని వేళలు సీరియస్‌గా అమలు చేస్తున్నాం
- విద్యార్థులకు 75 శాతం హాజరు ఉండాల్సిందే
- మెస్ బిల్లు రూ.2200లకు తగ్గించాం
- రూ.322 కోట్లతో కొత్త భవనాల నిర్మాణాలకు డీపీఆర్ రూపొందించాం

'సాక్షి'తో ఎంజీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

యూనివర్సిటీలో సమయ పాలన కఠినంగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు, అధ్యాపకుల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కచ్చితంగా ఉండాల్సిందే. విద్యార్థుల హాజరు శాతం కూడా 75 శాతం ఉండాలి. ఏదైనా కారణం చేత తరగతులకు హాజరు కాకపోతే కనీసం 65 శాతం ఉండాల్సిందే. మరో 10 శాతానికి డాక్టర్ సర్టిఫికెట్ కూడా తేవాల్సి ఉంటుంది. కొందరు కాలేజీకి దుమ్మా కొట్టడంతో 25 శాతం కూడా లేదు. అటువంటి వారు 63 మంది డిటెన్షన్ అయ్యారు. కచ్చితంగా హాజరు శాతాన్ని, కాలేజీ పనివేళలు అమలు చేస్తుండడంతో మెరుగైన ఉత్తీర్ణత రానుంది.

కొత్త కోర్సులకు నిర్ణయం

యూనివర్సిటీలో మరిన్ని కోర్సులు ప్రవేశ పెడుతున్నాం. కొత్తగా స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మించనున్నాం. కొత్తగా 56 ప్రోగ్రామ్ కోర్సులను తీసుకువచ్చేందుకు ఇప్పటికే డిజైన్ చేశాం. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో రెండు కోర్సులకు తగ్గకుండా కొత్త కోర్సులు తీసుకొస్తాం. లైబ్రరీని వారంలో రెండు రోజులు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నడిపించనున్నాం. అక్కడ విద్యార్థులకు క్రెడిట్ కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ఇంటర్న్‌షిప్ కోసం ఒక డైరెక్టర్‌ను కూడా నియమించాం. కంపెనీలతో మాట్లాడి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

రూ.322 కోట్లతో డీపీఆర్ తయారు..

యూనివర్సిటీలో ప్రాంగణంలో కొత్తగా భవనాలు నిర్మించడానికి రూ.322 కోట్లతో డీపీఆర్ తయారు చేయించి ప్రభుత్వానికి పంపించాం. ఫార్మసీ కాలేజీ, ఎడ్యుకేషన్ కాలేజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల కోసం కొత్తగా భవనాలు నిర్మిస్తున్నాం. 2200 మంది విద్యార్థులు చదువుతున్న యూనివర్సిటీలో 1900 మంది యూనివర్సిటీ హాస్టల్‌లోనే ఉండే విధంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నిర్మాణాలు చేపడుతున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మాణం జరిగితే ఉమ్మడి జిల్లాలోని వేల మందికి శిక్షణ ఇస్తాం.

మెస్ బిల్లులు తగ్గింపు

యూనివర్సిటీలో విద్యార్థుల మేనేజ్‌మెంట్‌తోనే హాస్టల్ నడుస్తుంది. విద్యార్థులు నెలకు రూ.2600 వరకు చెల్లిస్తుండగా ప్రస్తుతం రూ.2200క తగ్గించాం. విద్యార్థులపై భారం పడకుండా, రానున్న రోజుల్లో రూ.1900లకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉన్న విద్యార్థుల వరకే భోజనం, అల్పాహారం తయారు చేస్తున్నారు.

డీసీసీబీ, పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగింపు

- ఆరు నెలల పాటు కొనసాగనున్న ప్రస్తుత పాలకవర్గాలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

జిల్లా	పీఏసీఎస్‌లు
నల్లగొండ	42
సూర్యాపేట	44
యాదాద్రి	21
మొత్తం	107

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల కాల పరిమితిని ప్రభుత్వం పొడిగించింది. మరో ఆరు నెలల పాటు ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలే కొనసాగేలా నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల కిందట (2020 ఫిబ్రవరి 15వ తేదీన) సహకార సంఘాల ఎన్నికలు జరిగి పాలక వర్గాలు ఏర్పాటయ్యాయి. పాలక వర్గాల గడువు శుక్రవారం నాటితో (ఈనెల 15వ తేదీతో) ముగియడంతో ప్రభుత్వం పాలకవర్గాల గడువును మరో ఆరు నెలలు పెంచింది. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు గురువారం జీవో 74 జారీ చేశారు.

గతేడాదే మారిన డీసీసీబీ చైర్మన్

ఉమ్మడి జిల్లాలో 107 పీఏసీఎస్‌లు ఉన్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం 2020 ఫిబ్రవరి 29న ఎన్నికైంది. బీఆర్‌ఎస్‌కు చెందిన గొంగిడి మహేందర్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆయనపై 2024 జూన్ 28న అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి గత ఏడాది జూలై 1వ తేదీన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం సహకార సంఘాల గడువును పెంచడంతో డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి మరో ఆరు నెలలుపాటు కొనసాగనున్నారు. అలాగే జిల్లాలోని సహకార సంఘాల చైర్మన్లు కూడా యథావిధిగా కొనసాగుతారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

రైతులకు సేవలందించేందుకు మరో అవకాశం

రైతులకు మరో ఆరు నెలలు సేవలు అందించే అవకాశం లభించింది. పదవీ కాలం పొడగించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు. ఈ అవకాశంతో రైతులకు మరింతగా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తా.

– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆధారంగా అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఇందిరమ్మ గృహాల నిర్మాణం, గ్రామాల వారీగా అర్హులైన లబ్దిదారుల జాబితా తయారు తదితర అంశాలపై సమీక్షించారు. ఈనెల 20వ తేదీ నాటికి ఇళ్ల లబ్దిదారుల జాబితా రూపొందించాలని చెప్పారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శులు, మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెల 26న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన గ్రామాల్లో నిర్మాణానికి తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి విస్తీర్ణం, చెల్లింపులు, వాడాల్సిన సాంకేతిక అంశాలను తెలియజేశారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్



ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్ రవికుమార్

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సర్వేయర్ లావూడి రవికుమార్ శుక్రవారం రూ.12వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. సరంపేట పరిధిలోని సర్వే నంబర్ 366లో గల తన వ్యవసాయ భూమిని సర్వే చేయమని రైతు కోరగా రూ.15వేలు ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేశారు. ఈక్రమంలో ఫిర్యాదుదారుడి కుమారుడి నుంచి రూ.12వేల నగదును సర్వేయర్ రవికుమార్ తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంతోపాటు మిర్యాలగూడలోని సర్వేయర్ రవికుమార్ ఇంటి వద్ద మరో టీం మొత్తంగా రెండు టీంలు సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ నల్లగొండ డీఎస్పీ ఎం.జగదీశ్‌చందర్, సీఐలు రామారావు, వెంకట్‌రావుల తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పెద్దఅడిశర్లపల్లి : వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం గుడిపల్లి మండల కేంద్రంలోని రైతుభవన్‌లో డివిజన్ వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రానున్న వేసవిలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో ఎలాంటి వైరస్‌లు సోకకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశ రవి, ప్రోగ్రాం ఆఫీసర్లు అరుంధతి, కృష్ణకుమారి, పద్మ, కళ్యాణచక్రవర్తి, డివిజన్ మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్

పెద్దగట్టు ముస్తాబు

రేపటి నుంచి దురాజ్‌పల్లి శ్రీలింగమంతులస్వామి జాతర

- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- రంగులతో రూపుదిద్దుకున్న ఆలయం, సింహద్వారం
- ఆలయం చుట్టూ చలువ పందిర్లు
- పరిసరాల్లో వెలుస్తున్న దుకాణాలు

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్రంలోనే రెండవ అతిపెద్దదైన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామంలోని శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఈనెల 16 నుంచి 20 వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధశాఖలకు కేటాయించిన పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుగుతున్న ఈ జాతరకు మన రాష్ట్రం నుంచే కాకుండా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం నుంచి జాతర ప్రారంభం కానుండడంతో ఆలయ పరిసరాల్లో వివిధ దుకాణాలు వెలుస్తున్నాయి. భక్తుల కోసం జాయింట్ వీల్ (రంగుల రాట్నం), బ్రేక్ డ్యాన్స్, సర్కస్, హంస వాహనం, ఎగ్జిబిషన్ తదితర వినోద శాలలను ఏర్పాటు చేస్తున్నారు.

భక్తుల కోసం సౌకర్యాలు..

జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మిషన్ భగీరథ విభాగం ద్వారా తాగునీరు అందించేందుకు 14 ప్రదేశాల్లో నల్లాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయంతోపాటు పరిసరాల చుట్టూ 66 సీసీ కెమెరాలు అమర్చారు. చెరువు కట్టపై నడిచే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ వెలుతురు కోసం హైమాస్ట్ లైట్లు బిగించారు. తప్పి పోయిన చిన్నారులకు ప్రత్యేక శిబిరంతోపాటు భక్తులకు ఎండవేడిమి నుంచి రక్షణకు చలువ పందిర్లు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీలింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలు



ముస్తాబైన శ్రీలింగమంతుల స్వామి ఆలయం

వివిధ పనులకు నిధుల కేటాయింపు ఇలా..

జాతర నిర్వహణకు ప్రభుత్వం 70 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని దానిని చదును చేయించింది. ఇతర అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఈసారి గుట్టపై దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో, గుట్టకింద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.67 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గుట్ట చుట్టూ హైమాస్ట్, టవర్ లైట్లకు రూ.35 లక్షలు కేటాయించారు. అలాగే జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు బారికేడ్ల నిర్మాణానికి రూ.12 లక్షలు, తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాటుకు రూ.12 లక్షల నిధులు కేటాయించారు. ఇవేకాక, చెత్త తొలగింపునకు రూ.25 లక్షలు, నేల చదునుకు రూ.10 లక్షలు, ఆలయం చుట్టూ చెట్ల పొదలు తొలగించేందుకు రూ.8లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.3లక్షలు, నీటి ట్యాంకర్ల కోసం రూ.5లక్షలు, గల్పర్ ద్వారా బురద తరలించేందుకు రూ.4లక్షలు, సీసీ రోడ్ల మరమ్మతులకు రూ.5లక్షలు, జాతర స్టోర్ డస్ట్‌కు రూ.5 లక్షలు, గ్రావెల్ కోసం రూ.5లక్షలు కేటాయించారు. సీసీ కెమెరాలు, సోలార్ లైట్ల మరమ్మతులకు రూ.5లక్షలు, స్నానాలు చేసేచోట ప్లాట్‌ఫామ్, పైపులైన్ ఏర్పాటుకు రూ.9.30 లక్షలు, నీటి మోటార్స్, సింథటిక్ ట్యాంక్స్, హెచ్‌డీపీఓ పైపులైన్ కోసం రూ.5లక్షలు, కోనేరులో శివుడి విగ్రహం ప్రతిష్ఠించేందుకు రూ.3 లక్షలు, నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

జాతరకు 60 ప్రత్యేక బస్సులు

భానుపురి (సూర్యాపేట): చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరకు భక్తుల సౌకర్యార్థం సూర్యాపేట డిపో నుంచి 60 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న తెల్లవారు జామున ప్రారంభమై ఈనెల 20 వరకు జాతర కొనసాగనుందని, ఈ ఐదు రోజుల పాటు ఈ బస్సుల ద్వారా జాతరకు ప్రయాణికులను చేరవేస్తాయని పేర్కొన్నారు. సూర్యాపేట నుంచి పెద్దగట్టు జాతరకు బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు

జాతర నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ముఖ్యంగా పారిశుద్ధ్య పనులు, లైటింగ్, సివిల్ పనులు చేయించాం. జాతర ముగిసే వరకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది, ప్రత్యేక అధికారులను అందుబాటులో ఉంచుతాం.

– బోల్ల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట



జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నల్లగొండ: మండలంలోని ఆర్జాలబావి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలయ్యాయి. నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన కొంగరి ప్రకాష్ (22) డిగ్రీ మధ్యలో ఆపేసి ఇంటి వద్దే కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌లో కిరాణా సరుకులు తెచ్చేందుకు గురువారం రాత్రి 11 గంటలకు ముదిమాణిక్యం గ్రామం నుంచి తన స్నేహితుడు రెబ్బలపల్లి శంకర్‌ను తీసుకుని బైక్‌పై బయల్దేరాడు. శుక్రవారం ఒంటిగంట ప్రాంతంలో ఆర్జాలబావి వద్దకు రాగానే బైక్ రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో నల్ల గొండకు తరలించగా ప్రకాష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకర్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గార్మెంట్ షెడ్‌లో ఇనుప సామగ్రి చోరీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో, ఇనుప సామగ్రి

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఓ చేనేత వ్యాపారి నిర్మిస్తున్న గార్మెంట్ షెడ్‌లో ఇనుప స్తంభాలు అపహరణకు గురయ్యాయి. ఈ నెల 11న ఈ ఘటన చోటుచేసుకోగా.. శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. టెక్స్‌టైల్ పార్క్‌లో షెడ్ నిర్మాణం జరుగుతున్న ప్రదేశం నుంచి మిగిలిన ఇనుప స్తంభాలను గుర్తు తెలియని వ్యక్తి ఆటోలో తరలించినట్లు వ్యాపారికి సమాచారం అందింది. దీంతో వ్యాపారి చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్మాణం జరుగుతున్న షెడ్ పక్కన ఉన్న ఓ కుటీర పరిశ్రమ వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్న దండుమల్కాపురం గ్రామానికి చెందిన మీసాల శంకరయ్యపై అనుమానం వ్యక్తం చేయగా.. పోలీసులు దర్యాప్తు విచారించారు. తానే ఇనుప స్తంభాలను దొంగిలించి భూదాన్ పోచంపల్లిలో ఉంటున్న తన అల్లుడు ఇంటికి ఓ ఆటోలో వేసి పంపించినట్లు చెప్పాడు. దీంతో ఆటోలో తరలించిన ఇనుప స్తంభాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, శంకరయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రెండు లీటర్ల సారా పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలో శుక్రవారం 2 లీటర్ల సారాను పోలీసులు పట్టుకుని మహిళపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ అంతిరెడ్డి వివరాల ప్రకారం.. చింత్రియాల గ్రామంలో నాటు సారా అమ్ముతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి సోదాలు నిర్వహించారు. గుగులోతు వెంకటేశ్వర్లు భార్య విజయ తన ఇంటి వెనక రెండు లీటర్ల సారా దాచిపెట్టి పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు ఆమెను పట్టుకుని 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరి పైరు ఎండుతోంది

- ఎస్సారెస్పీ ఆయకట్టుకు అందని సాగునీరు
- అడుగంటిన భూగర్భజలాలు
- నేలమర్రిలో ఎండిపోయిన 70ఎకరాల్లో పశువులను మేపుతున్న రైతులు



నేలమర్రిలో ఎండిపోయిన వరి చేనులో మేత మేస్తున్న గేదెలు

మునగాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగునీరు విడుదల చేయకపోవడంతో మునగాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగుచేసిన వరి చేను ఎండిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని నేలమర్రి క్లస్టర్ పరిధిలో ప్రస్తుత యాసంగిలో రైతులు 4,400 ఎకరాల్లో వరి సాగుచేశారు. గతంలో ఈ క్లస్టర్ పరిధిలోని భూములకు ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు రావడంతో పలు గ్రామాల్లో చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండేది. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతాంగం బోర్లు, బావుల కింద యాసంగిలో వరి సాగుచేశారు. ప్రస్తుతం బోర్లు, బావుల్లో భూగర్భజలాలు తగ్గిపోవడంతో సాగుచేసిన వరిపైర్లకు నీరు అందక ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఒక్క నేలమర్రి గ్రామపంచాయతీ పరిధిలో 70ఎకరాల్లో వరిపైర్లు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పశువులను మేపుతున్నారు. పరిస్థితి ఇదేవిధంగా ఉంటే మరోపక్షం రోజుల్లో మరికొన్ని ఎకరాల్లో వరిపైర్లు ఎండిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసి వారం రోజుల పాటు చెరువులు, కుంటలు నింపితే భూగర్భజలాలు పెరిగి పైర్లకు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఐదెకరాల్లో వరిచేను ఎండిపోయింది



నేను ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఏడెకరాల్లో వరి సాగుచేశా. ఇప్పటికే ఎకరాకు రూ.20నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టాను. సాగునీరు అందక ఇప్పటికే ఐదెకరాల వరిపైరు ఎండిపోయింది. గత్యంతరం లేక పశువులను మేపుతున్నా. నాతో పాటు గ్రామంలో పలువురు రైతులు పశువులు మేపుతున్నారు. ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు విడుదల చేస్తే కొంతమేర ఉపశమనం కలుగుతుంది.

– గుడిపూడి అనిల్‌గౌడ్, రైతు, నేలమర్రి

అజోల్లా పెంపకంతో పశువుల్లో పాల ఉత్పత్తి పెంపు

- సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



గుంజలూరు గ్రామంలో అజోల్లా ఉత్పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

చివ్వెంల(సూర్యాపేట) : అజోల్లా మేతగా వాడడం వల్ల పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామానికి చెందిన పెద్ద పోలు జయమ్మ నీటి తొట్టిలో పెంచిన అజోల్లాను పరిశీలించి మాట్లాడారు. సంబంధిత రైతు దాణా తయారీతో పాటు, పశువులు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా కొట్టం వేయడంతో కలెక్టర్ పరిశీలించి, దీని వల్ల కలిగే ప్రయోజనం గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి పాఠశాల సమస్యలు వివరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ అప్పారావు, డీపీఓ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, ఈసీలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


- యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు



రక్తదానం చేసిన వైద్యులకు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి : రక్తదానం మరొకరికి ప్రాణదానమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదానం శిబిరంలో వైద్యులు, వైద్యుల కుటుంబ సభ్యులు, పారామెడికల్ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల రక్తదానంతో పాటు మరణానంతరం అవయవదానం చేసేందుకు ముందుకు రావడం మంచి పరిణామమని అన్నారు. ఆస్పత్రిలో రక్తం కొరత ఉందని ప్రస్తుతం రక్తం కొరత లేకుండా వైద్యులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. త్వరలో ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, డీసీహెచ్ఎస్ చిన్ననాయక్ కలిసి ఆస్పత్రి రూపురేకలు మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ఇంటికి రూ.2,06,418 విద్యుత్ బిల్లు



No.110345358(4110105614),EMMADI G.
Please pay the bill amount (inclusive of arrears, if any) of Rs.206418 by

వినియోగదారుడి ఫోన్‌కు వచ్చిన బిల్లు మెసేజ్

చిట్యాల: చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వేణుగోపాల స్వామి కాలనీలో ఓ నివాస గృహానికి రూ.2,06,418 బిల్లు వచ్చింది. కాలనీకి చెందిన ఇమ్మడి గణేష్ ఇంటికి విద్యుత్ వాడకానికి సంబంధించి జనవరి నెలకు అధికారులు మీటర్ రీడింగ్ స్లిప్ అందజేశారు. అందులో రూ.2,06,418 బిల్లు ఉండడం చూసి వినియోగదారుడు షాక్‌కు గురయ్యాడు. అతనిది డబుల్ బెడ్‌రూం ఇల్లు. గణేష్ దంపతులకు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఇంటిలో నలుగురు నివాసం ఉంటున్నారు. ఇంటికి గత డిసెంబర్ వరకు రూ.850లోపు బిల్లు వచ్చేది. అయితే ఈ ఏడాది జనవరి 24న ఇంటికి సోలార్ ప్యానల్ పెట్టుకున్నాడు. దీనికోసం సోలార్ నెట్ మీటర్ అమర్చుకున్నట్లు ఇంటి యజమాని గణేష్ తెలిపాడు. రోజూ గృహ అవసరాలకు సోలార్ విద్యుత్ వాడుకోగా అదనంగా ఉత్పత్తి అయిన 6 యూనిట్లు విద్యుత్ సంస్థకు ఇస్తున్నట్లు చెప్పాడు. ఇలాంటి పరిస్థితుల్లో తన ఇంటికి రూ.2,06,418 బిల్లు చెల్లించాల్సిందిగా అధికారులు స్లిప్‌ఇచ్చారని వాపోయాడు. విద్యుత్‌బిల్లు చెల్లింపుపై ఏఈకి ఫిర్యాదు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో విద్యుత్ సంస్థకు ఫిర్యాదు చేసినట్లు గృహ యజమాని గణేష్ శుక్రవారం తెలిపాడు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మునుగోడు: కుటుంబ కలహాలతో వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన నిమ్మల మానస(28) తన భర్త నగేష్ తనను బాగా చూసుకోవడం లేదని, ఏదైనా అడిగితే కోపగించుకుంటున్నాడని మనస్తాపానికి గురై అతడితో మాట్లాడకుండా ఉంటోంది. ఈక్రమంలో శుక్రవారం నగేష్ నూతన రేషన్‌కార్డు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకుగాను మునుగోడుకు వెళ్లగా మానస పురుగుల మందు తాగింది. భర్త వచ్చేసరికి వాంతులు చేసుకుంటుండడంతో పురుగుల మందు తాగినట్లు గమనించిన భర్త వెంటనే 108 సాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందింది. కాగా.. వీరికి నాలుగేళ్ల కుమారుడు, మూడేళ్ల బాలిక ఉంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బీఆర్ఎస్ నేత అన్నెపర్తి శేఖర్ అరెస్ట్

- మధ్యాహ్నం వరకు ఆచూకీ తెలియక కుటుంబ సభ్యుల ఆందోళన
- కిడ్నాప్ చేశారని ఆ పార్టీ నేతల ఆరోపణ
- తన భర్తను అక్రమంగా అరెస్ట్ చేశారని హైకోర్టులో పిటిషన్ వేసిన భార్య సంతోష

చండూరు: చండూరు మాజీ జెడ్పీటీసీ అన్నెపర్తి సంతోష భర్త, చండూరు మున్సిపాలిటీ తాజా మాజీ 4వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అన్నెపర్తి శేఖర్‌ను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు నాటకీయ పరిణామాల నడుమ అరెస్ట్ చేశారు. సివిల్ డ్రెస్‌లో ఉన్నకొంత మంది తెల్లకారులో ఇంటికి చేరుకొని తలుపు తట్టి తన భర్తను తీసుకుని వెళ్లారని.. భార్య సంతోష తెలిపారు. ఇంటి వద్ద కొద్దిసేపు హల్‌చల్ చేయడంతో తాను ఎంతో ఆందోళన చెందానని ఆమె బోరున విలపించారు. తాను ప్రశ్నించినా సమాధానం చెప్పలేదని.. చివరకు పోలీసులమని చెప్పారని తెలిపారు. శేఖర్ అరెస్ట్‌ను పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం వరకు నిర్ధారించకపోవడంతో.. అరెస్ట్ చేశారా.. లేదా ఎవరైనా కిడ్నాప్ చేశారా అని కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చెందారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి రంగంలోకి దిగడం.. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఎస్పీని కలవడంతో అరెస్ట్‌పై క్లారిటీ వచ్చింది. శేఖర్ మూడు రోజుల క్రితం పట్టణంలో ఓ వ్యక్తిపై చేయి చేసుకున్నారని.. ఆ వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌చేసినట్లు సీఐ వెంకట్ తెలిపారు. అయితే తన భర్తను అక్రమంగా అరెస్ట్ చేశారని సంతోష హైకోర్టులో పిటిషన్ వేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని చూపుతున్న బాధితురాలు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని తుక్కాపురం గ్రామంలో శుక్రవారం గనగాని చంద్రయ్య ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గనగాని చంద్రయ్య బంధువుల వివాహం ఉండటంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇల్లు దగ్ధమై ఉంది. దీంతో ఇంట్లోని రూ.40వేల నగదుతో పాటు, వంట సామగ్రి, రెండు క్వింటాళ్ల బియ్యం, బీరువాలోని దుస్తులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కంటే నిధుల కేటాయింపు తగ్గించి వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కేంద్ర బడ్జెట్ పేదల జేబులు కొట్టి పెద్దలకు లబ్ధిచేకూర్చే విధంగా ఉందని, బీహార్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి వారి రాజకీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఈ బడ్జెట్ ద్వారా ప్రయత్నించారని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం వారి స్వలాభం, పార్టీ ప్రయోజనాల కోసమే పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. పేదల కడుపు నింపేందుకు ఉపయోగపడే జాతీయ ఉపాధి హామీ పథకానికి సైతం నిధుల కేటాయింపులు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు ఎవరికి వారుగా స్వతంత్రంగా జీవనం సాగించేందుకు కావలసిన వనరులను ఏర్పాటు చేయాల్సిన పాలకులు సంక్షేమ పథకాలను ఎరగా వేస్తూ సోమరిపోతులుగా తయారు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, ఏబీసీడీ వర్గీకరణ విషయంలో కేవలం శాసన సభలో మాత్రమే చర్చ జరపకుండా అఖిలపక్షాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. అనంతరం సీపీఎం నాయకులు బత్తిని రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, బ్రహ్మం, హుస్సేన్, సైదులు, వెంకటేశ్వర్లు, మురళి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఇసుక డంపు సీజ్

వలిగొండ : మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా నిల్వ చేసి ఇతరుల అవసరాలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసి ఇసుక డంపులను సీజ్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మల్లేపల్లికి చెందిన రేగు సైదులు 50 టన్నుల ఇసుక, అదే గ్రామానికి చెందిన మల్ల బాలరాజుకు చెందిన 45 టన్నుల ఇసుక, వెలవర్తికి చెందొన ఎడవెల్లి గణేష్‌కు చెందిన 40 టన్నుల ఇసుక అక్రమంగా డంప్ చేయగా.. పోలీసులు సీజ్ చేశారు. అదేవిధంగా గోకారంలో మందుల నర్సింహ 30 టన్నులు, దేశపాక భాస్కర్ 40 టన్నుల ఇసుక మూసీ పరీవాహక ప్రాంతం నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించి అక్రమంగా నిల్వ చేయడంతో సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి ఇసుక డంపులను సీజ్ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదం

- ఆరుగురికి గాయాలు



గాయాలపాలైన దినసరి కూలీలు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ బాయిలర్ వద్ద శుక్రవారం ప్రమాదం చోటు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. ఇటీవల రెండవ యూనిట్‌ను ప్రారంభించగా ఈ యూనిట్‌లో ఈఎస్‌పీ వైపు వెళ్లే ప్రధాన పైపులైన్ పూర్తిగా స్తంభించిపోవడంతో బాయిలర్ నిలిచిపోయింది. బూడిద యంత్రాన్ని శుభ్రం చేస్తుండగా వేడిగా ఉన్న బూడిద కూలీలపై పడింది. దీంతో దినసరి కూలీలు అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన వై. వెంకటేశ్వర్లు, దుబ్బతండాకు చెందిన హతిరాం, రూప్లానాయక్, దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామానికి చెందిన సైదా, వీర్లపాలెం గ్రామానికి చెందిన లింగానాయక్‌లతో పాటు కంపెనీలో పని చేస్తున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన వికాస్ జైస్వాల్‌లకు గాయాలయ్యాయి. స్పందించిన కంపెనీ అధికారులు వీరికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

రోడ్డుప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు

చిలుకూరు: ట్రాక్టర్ ఆటోను ఢీకొనడంతో ఆరుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చిలుకూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. హుజూర్‌నగర్ మండల పరిధిలోని వేపుల సింగారానికి చెందిన పలువురు గ్రామస్తులు ఆటోలో మునగాల మండలం తుర్కగూడెం గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో కోదాడ నుంచి వస్తుండగా చిలుకూరు గ్రామం వద్దకు రాగానే హుజూర్‌నగర్ వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఆటో పల్టీకొట్టింది. దీంతో ఆటోలో పది మంది ఉండగా.. వారిలో సృజనమ్మ, నాగమణి, మరియమ్మ, తెరోజమ్మ, బక్కమ్మ, మేరమ్మతోపాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో హుజూర్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఘటన స్థలాన్ని చిలుకూరు ఎస్ఐ సురభి రాంబాబు గౌడ్ పరిశీలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆండాళ్‌దేవిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ తిరు, మాడవీధుల్లో భాజాభజంత్రీలతో అమ్మవారి సేవను ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో సేవను అధిష్ఠింపజేసి మంగళహారతినిచ్చారు. ఇక ప్రధానాలయంలో వేకువ జామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, నిజాభిషేకం, అర్చన పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తరం, ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వేద ఆశీర్వచనం, తదితర కైంకర్యాలు గావించారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం జరిపించి ఆలయ ద్వారబంధనం చేశారు.

లతీఫ్ సాహబ్ గుట్టపై మంటలు



నల్లగొండ: పట్టణంలోని లతీఫ్ సాహబ్ గుట్టపై 401 మెట్టు వద్ద శుక్రవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో ఘటనా స్థలానికి చేరుకున్న వన్ టౌన్ పోలీసులు ఫైర్ సిబ్బంది సహకారంతో మంటలు ఆర్పివేశారు. ఆకతాయి సిగరెట్ తాగి ఆర్పివేయకుండా అక్కడే పడేయడంతో మంటలు చెలరేగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు సాహిత్యం దోహదం



మాట్లాడుతున్న తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి

రామన్నపేట: మనిషికి, ప్రకృతికి మధ్య జరిగే సంఘర్షణల ద్వారా పుట్టుకు వచ్చే సామాజిక రుగ్మతలను రూపు మాపడానికి సాహిత్యం దోహద పడుతుందని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందచారి అన్నారు. శుక్రవారం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ– తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో కవిత్వం, కథ, పాట, రచనపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పలేని విషయాలను సాహిత్యం బోధిస్తుందని, మనిషిని మనిషిగా ప్రేమించడం నేర్పిస్తుందన్నారు. 17వ శతాబ్దంలో వేమన చెప్పిన పద్యాలు నేటికీ వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయన్నారు. అదేవిధంగా ప్రముఖకవి పెరుమాళ్ల ఆనంద్ కథా నిర్మాణం, డాక్టర్ సాగర్ల సత్తయ్య కవిత్వ నిర్మాణ పద్ధతులపై, ఏబూషి నర్సింహ పాట నిర్మాణంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, తెలంగాణ సాహితీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి ఎండీ హసేనా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జేసీ బాబు, డాక్టర్ రాచమల్ల శ్రీనివాస్, అధ్యాపకులు ఆంజనేయులు, గోపికృష్ణ, బాసరాజు యాదగిరి పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోదాడ రూరల్ : కోదాడ మండలంలోని గుడిబండలో గ్రామస్తులు వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో గత వారం రోజుల క్రితం రెండు వానరాలు ఒకదానికొకటి పోట్లాడుకున్నాయి. దీంతో ఒక వానరానికి తీవ్రగాయాలు కావడంతో స్థానికంగా మాధవరపు సీతారాములు ఇంటి వద్ద పశువైద్యాధికారిచే రెండు రోజుల పాటు చికిత్స అందజేశారు. శుక్రవారం మృతిచెందడంతో గ్రామస్తులు మేళతాళాలు, డీజే చప్పుళ్లతో వానరాన్ని ఊరేగించి అంత్యక్రియలు నిర్వహించారు.

వృద్ధురాలు అదృశ్యం



ఇరుగు నర్సమ్మ

నూతనకల్: మండల కేంద్రంలో వృద్ధురాలు అదృశ్యం కావడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇరుగు నర్సమ్మ మతిస్థిమితం కోల్పోయింది. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 86037 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్లోబల్ ఎక్స్‌పోలో ఇక్కత్ వస్త్రాల ప్రదర్శన



పోచంపల్లి ఇక్కత్ విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న విదేశీయులు

భూదాన్‌పోచంపల్లి: న్యూ ఢిల్లీలో శుక్రవారం ప్రారంభమైన గ్లోబల్ టెక్స్‌టైల్ ఈవెంట్ ఫాటో భారత్ టెక్స్ 2025, గ్లోబల్ టెక్స్‌టైల్స్ ఎక్స్‌పోలో పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు, మగ్గాన్ని ప్రదర్శించారు. వారం రోజుల పాటు జరగనున్న ఈవెంట్‌లో తెలంగాణ నుంచి హైదరాబాద్‌లోని వీవర్ సర్వీస్‌సెంటర్ ఆధ్వర్యంలో పోచంపల్లికి చెందిన భోగ బాలయ్య, అసిస్టెంట్ గంజి విజయ్‌కుమార్‌తో కలిసి మగ్గంపై తయారు చేసిన వెయ్యి షేడ్స్ కలిగిన స్కార్ఫ్, జాతీయ జెండాను ప్రదర్శించారు. అదేవిధంగా మగ్గం లైవ్ ప్రదర్శన ఇచ్చారు. మొదటి రోజు న్యూ ఢిల్లీ వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ విషేశ్ నాటియాల్ తో పాటు పలువురు దేశ, విదేశీ ప్రతినిధులు సందర్శించి పోచంపల్లి ఇక్కత్ విధానం, చేనేత వస్త్రాలకు అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపు, ప్రాముఖ్యత, డిజైన్లు, నాణ్యతను తెలుసుకొని ప్రశంసించారని బాలయ్య తెలిపారు.